రహస్యం

విమల. వి

మనసంతా ఉద్వేగంతో నిండివుంది రావుకి –

ఎందుకోసమో తొందరపడుతోందాతడి మనసు. అసహనంగా వాచీ చూసుకున్నాడు – అలా చూసుకోవటం అప్పటికి అది తొంభై ఎనిమిదోసారి –

పదకొండు గంటలు!

ఇంత టైమయినా కాత్యాయిని రాదేం గదిలోకి?

సుమారు ఓ రెండుగంటల క్రితం భోజనాలయేయి. కాత్యాయినికి తన ప్రక్కనే వేసేరు పీట ... చాలా సరదాగా గడిచిపోయింది భోజనాల దగ్గర ... ఎవరో ఓ ముసలావిడ,

"అదేవిట్రా, కొత్త దంపతులు కదా ... ఎంగిలి తినొద్దూ. పెళ్ళాంచేత నీ ఎంగిలి తినిపించవయ్యా" అంది.

రావు మొహంలోకి రక్తం ప్రవహించినట్లైంది.

ఆవిడెవరో ఖచ్చితంగా తన మనసులోని మాటే అంది. అలా తామిద్దరూ ఒకరిచేత ఒకరు తినిపించుకుంటూ భోజనంచేస్తే ఎంత బావుంటుందో! ఇంతలో ఓ ఆదర్శ వనిత,

"ఛ! ఎంగిలి తినడమేవిటి అసహ్యంగా ... అంతగా తినాలనిపిస్తే ముందు ముందు చాలా రోజులున్నాయ్ ... అసలే అది సిగ్గుపడిపోతోంది" అంది.

ముసలావిడ బుగ్గలు నొక్కుకుంటూ వెళ్ళిపోయింది.

కాత్యాయిని ఓ నిట్టూర్పు విడవటం తనకి స్పష్టంగా విన్పించింది. నిజంగానే కాత్యా సిగ్గుపడివుండాలి అనుకున్నాడు రావు.

కాత్యా అన్నలూ, వదినలూ వేళాకోళాలతో, వెక్కిరింపులతో గంట తిన్నారు ... నిజానికి తామిద్దరూ అసలేం తినలేకపోయేరు – ఉట్టినే కెలుకుతూ కూర్చున్నారు –

కాత్యా కూడా తనలాగే తాము యిద్దరూ గడపబోయే మధురమైన క్షణాల్ని తల్చుకుంటుందేమో అన్న భావన రాగానే అతనికి నవ్వొచ్చింది!

ఆ తర్వాత రావు తల్లి కాత్యాకి పట్టుచీర పెట్టింది – కాత్యా తండ్రి రావుకి కొత్త బట్టలు పెట్టేడు.

రావు కొత్త బట్టలు ధరించేడు – కాత్యా పట్టుచీర కట్టుకొని హాల్లోకి వచ్చింది. రావు కళ్ళు మిరిమిట్లుగొలిపేయి. ఎర్రగా ధగధగా మెరిసే పట్టుచీరలో కాత్యా 'అప్సరస'లా వుంది

"అంతలా చూసెయ్యకండి – దిష్టి తగిలేను..." కాత్యా చెల్లెలు కొంటెగా అంది.

అసలే మొహమాటస్తుడయిన రావుకి సిగ్గేసింది. తన మైమరపుకి తనే నిందించుకున్నాడు. అందరూ గొల్లుమని నవ్వేరు. ఆమె తల్లి ఆ పిల్లని మందలించింది ఏవిటా వేళాకోళాలు – అంటూ.

కాత్యా తన పెద్ద పెద్ద కళ్ళను వాల్చేసుకుని చేతులు కట్టుకుని తల వంచి నిలబడిపోయింది ఏం చేయాలో తోచక.

వాళ్ళిద్దరూ పెద్దలందరికీ నమస్కారాలు పెట్టేరు. ఆశీర్వాదాలందుకొన్నారు.

బావమరిది, రావుని విశాలమైన మేడమీది గదిలోకి తీసుకెళ్ళి,

"ఇదే మీ రాజ్యం..." అని చిలిపిగా కన్నుగీటి వెళ్ళిపోయేడు —

పెద్ద పాతకాలం పందిరిమంచం — మెత్తటి పరుపుమీద తెల్లటి బెడ్‌స్ప్రెడ్ ... అగరొత్తులూ, స్వీట్స్, పళ్ళూ అట్టహాసంగా, సినిమాల్లోలానే వుంది అచ్చం అనుకున్నాడు రావు — కాలక్షేపానికి ఏమైనా చదువుకుందామంటే చిన్న పేపర్ ముక్క కూడా లేదక్కడ.

మంచానికి చేరబడి, ఒళ్ళో దిండు పెట్టుకుని కళ్ళు మూసుకున్నాడు అలసటగా రావు — మూడ్రోజులైంది సరైన నిద్రపోయి మూడ్రోజులేమిటి ఈ పెళ్ళి నిశ్చయమైంది దగ్గర్నించీ నిద్రలేదు — చూడగానే మంచి పిల్ల అనిపించే అందమైన కాత్యాయినిని ఎప్పుడైతే చూసేడో అప్పట్నుంచే రావుకి నిద్రపట్టటం మానేసింది.

నిజంగా కాత్యా మెతకపిల్లే 'చిరునవ్వులు చిందించటం తప్ప మరేమీ తెలియని ముగ్ధా ఈమె' అనిపించేలా వుంటుంది కాలేజ్‌లో ఇంటర్ చదివినా ఈ కాలం పిల్లల్లా గడుసుదనం నుచ్చుకైనా కనుపించదు.

లేకపోతే ఏమిటి ?

జరిగిన పెళ్లి తంతులో పిచ్చిపిల్ల ఓడిపోతూనేవుంది

తలంబ్రాలు పోసేప్పుడు చివరివరకూ బుల్లి బుల్లి దోసిళ్లలో పోస్తూంటే, రావు ఫ్రెండ్స్ గొడవ పళ్లెం ఎత్తి పోసెయ్యరా అని ... రావు తనదీ, ఆమెదీ కూడా పళ్లేలు ఎత్తి ఆమె నెత్తిన గుమ్మరించేడు ! ఆలుచిప్పల్లాంటి ఆ కళ్లనెత్తి అలా తన వైపు చూడబోయి అతని చూపుల్లో ఆమె చూపులు చిక్కుకుంటాయని కాబోలు గబుక్కున వాల్చేసుకుంది !

ఆమె స్నేహితురాళ్ళు, "మొద్దూ... ఏ... సిగ్గులేదుటే అలా పోస్తూంటే చూస్తూ వూరుకుంటావా ?" అని చిలిపిగా మందలిస్తున్నా ముగ్ధమనోహరమైన చిరునవ్వుతో అలాగే కూర్చుండిపోయింది

ఆ తరువాతమాత్రం ?

ఇరుకుమూతి బిందెలో ఉంగరం, మెట్టె వడేసి బ్రాహ్మడు ఇద్దర్ని చేతులూ అందులో వుంచి ఎవరు ఉంగరం తీస్తే వారు గెలిచినట్లే అన్నపుడు, చెయ్యి అందులో పెట్టడానికి మహా సిగ్గుపడిపోయింది. రావు వైపు ఇబ్బందిగా చూసింది. అతను ఫర్వాలేదన్నట్లు చూసి తన చెయ్యి పెట్టేక రెండు క్షణాలాగి కాత్యా తన చెయ్యి పెట్టింది.

అప్పుడు తానేం చేసేడు ?

ఉంగరంకోసం వెతుక్కుండా తెల్లని ఆ బుల్లి చేతిని పట్టుకున్నాడు ... పాపం ఎంత సిగ్గుపడి పోయిందో — ఆమె ఫ్రెండ్స్

"తియ్యవే ఉంగరం" అని కాకిగోల.

ఆమె వెతకటం మొదలెట్టింది రావు చేతికి మెట్టె వచ్చింది. అది తీసి ఆమె చేతిలో బలవంతాన పెట్టి ఆమె చేతిని గిల్లి ఉంగరం లాక్కున్నాడు. అందమైన చిరునవ్వుని పెదవుల వరకే బిగించి చూసిన ఆ చూపు రావు వెయ్యి జన్మలకైనా మరచిపోగలడా ?

పాపం రావు కోసం మూడుసార్లూ ఓడిపోయింది !

అప్పగింతలయి విడిదింట్లోకి కాత్యాతో సహా అందరూ వెళ్లి కూచున్నారు.

తీరిగ్గా వున్న అమ్మలక్కలు "ఏదమ్మాయ్, నువ్వు బాగా సంగీతం నేర్చుకున్నావుటకదూ ! ఓ పాట పాడు..." అన్నారు.

పాపం, కొత్తకదా, భయపడిపోయింది

రావు వైపు రక్షించమన్నట్లు చూసింది బేలగా.

"ప్లీజ్, నాకు జలుబుచేసి గొంతు మూసుకు పోయింది ఆ సంగతి వాళ్లతో చెప్పండి" అంది రహస్యంగా.

"తనకి పాపం జలుబు చేసిందట తర్వాత పాడుతుందిలే" ఇంకా వాక్యం పూర్తైనా కాకముందే చెల్లాయి —

"అమ్మో ! వదిన ఎంత గడుసుదిరా అన్నయ్యా, ఇంకా పెళ్ళయి రెండుగంటలన్నా కాలేదు ఎలా వెనకేసుకొస్తున్నావురా ."

కాత్యాని గడుసు అంటే రావు భరించలేక పోయేడు పట్టుదల పెరిగింది.

"కాత్యా ! ఎలాగోలా పాడెయ్ !"

"ఎలాగండీ"

"ఇలా మాట్లాడుకొంటే అంతా ఎగతాళి చేస్తారు — పాడు."

కొద్దిగా ఆజ్ఞాపించినట్లే అన్నాడు రావు

పాపం వెంటనే పాడేసిందో కృతి !

రావుకి సంగీతం తెలీదు. అయినా మైమరచి పోయేడు ఎంత మధురమైన గొంతుక కాత్యాది... ఎన్ని జన్మల పుణ్యమో తనది ... ఇంత మంచి భార్య దొరకటం !

* * *

కాలి అందెల రవళులు ... మృదువుగా పడే అడుగుల సవ్వడి తలెత్తి చూసేడు రావు .. దేవతలా నుంచుంది కాత్యా ... గుమ్మం పట్టుకుని ... 'ఎంత ముద్దొస్తోందో' అనుకున్నాడు రావు.

మెల్లగా లేచి ఆమె వైపుకి నడిచేడు.

"ఎన్ని యుగాలనించి తపస్సు చేస్తున్నానో తెలుసా ?"

చిరునవ్వు .. అదే ... ఆ చిరునవ్వే తన ప్రాణాలు తీసేది.

"ఎంత ముద్దొస్తున్నావో !"

గబుక్కున అరచేతుల్లో మొహం దాచుకుంది.

ఎంత పొడుగాటి వేళ్ళు ... పొడుగ్గా పెంచిన గోళ్లకి వున్న గోరింటాకు తళుక్కుమంది.

రావు హృదయంలో కోటి మందారాలు పూసినయ్.

"ఏయ్ ఏమిటా సిగ్గు ? యిక్కడెవరున్నారనీ ?"

"........"

"మాట్లాడవా ! సిగ్గెందుకు బుజ్జీ ?"

"మీరున్నారనీ..."

నవ్వొచ్చింది రావుకి ! పెద్దగా నవ్వేసేడు.

ఆమె భుజాల చుట్టూ చేతులువేసి "అలా కూచుందాం రా ?" అంటూ మంచంవేపు నడిపించుకెళ్లాడు.

కూచున్నాక ఆమె తల్లో సంపెంగలూ, విరజాజుల వాసన గాఢంగా పీల్చి, "అబ్బ, ఎంత హాయిగా వుంది" అన్నాడు తన మొహాన్ని ఆమె భుజంమీద ఆన్చి తన్మయత్వంగా —

ఇబ్బందిగా కదిలింది కాత్యా —

అదేం గమనించే స్థితిలో లేడు రావు.

"అన్నట్లు, ఓ పాట పాడవా ?" అన్నాడు ఆమె మొహంలో మొహం పెట్టి.

మొహం చిట్లించి గబుక్కున అటు తిప్పేసుకుందామె —

"ఛ ఛ, ఆ సిగ్గేమిటి నీకు ఖర్మ ? నేనిటు మాట్లాడుతుంటే అటు చూస్తావు..." అని బలవంతంగా తనవైపు తిప్పుకున్నాడు

కంపరాన్ని బలవంతాన అణుచుకుంటూ అతనివైపు తిరిగింది కాత్యా.

"ఎంతసేపూ నే వాగటమేనా ? నువ్వు మాట్లాడు కాత్యా" అన్నాడు గుసగుసగా.

అతని ఊపిరి వెచ్చగా తగుల్తోంది.

"ఏం మాట్లాడనూ..." అతి ప్రయత్నం మీద అంది. ఎంత దాచుకుందామన్నా విసుగు ఆమె మొహంలో కన్పిస్తోంది.

"నీ కళ్ళు ... బ్యూటిఫుల్..." అంటూ మీదకి వంగబోయేడు — చటుక్కున మొహం తిప్పుకుంది

"ప్లీజ్ ! ఒక్కసారి ... కాత్యా ప్లీజ్ !" ఆమె గడ్డం పట్టుకుని తనవేపు తిప్పుకున్నాడు... అతను ఏమాత్రం పరికించినా ఆమె మొహంలో నిరసన కనిపెట్టగలిగివుండేవాడు —

ఆపుకోలేని ఆవేశంతో ఆమెని హృదయానికి హత్తుకున్నాడు ... చేతుల్ని నెట్టేస్తున్నా పట్టించుకోలేదతను.

ఆమె మొహం మీదకు మొహం వంచి పెదవుల మీద గాఢంగా ముద్దు పెట్టుకోబోయేడు.

అతన్ని ఒక్కతోపుతోసి దూరంగా నించుంది.

తెల్లబోయేడు రావు. అప్పటిగ్గానీ ఆమె కళ్ళల్లో నిరసనని పసిగట్టలేకపోయేడు.

ఆమె దగ్గరకు వెళ్లి,

"ఏమిటిది కాత్యా ? ఏమైంది ?" అన్నాడు ఆమె కళ్ళల్లోకి చూడ్డానికి ప్రయత్నిస్తూ.

తల దించుకొంది.

ఆమెని అలా చూస్తూ నిగ్రహంతో వుండలేకపోయేడు రావు. ఏమీ ఆలోచించకుండా ఆమెని దగ్గరకు తీసుకోబోయేడు.

ఊపిరి బిగపట్టుకున్నట్టు ఒక సెకండు మాత్రమే కౌగిలిలో వుండి తన చుట్టూ వున్న అతని చేతుల్ని విడిపించుకుంది.

"ఎందుకిలా బిహేవ్ చేస్తున్నావ్ ? నేనంటే ఇష్టంలేదా ?" ఈ ప్రశ్న అడగటానికి అతను చాలా ఫీలయ్యేడు. ఆమెకి తనంటే ఇష్టంలేదు

అని అనుకోటానికే అతనికి భయంవేసింది. ౮గులనిపించింది .

అన్నిటికన్నా ఆమె మౌనం అతన్ని మరీ కృంగదీసింది

"నీ మనసులో వున్నదేదో ఫ్రాంక్‌గా చెప్పెయ్ కాత్యా ... నేనేమీ అనుకోను..."

చురుగ్గా కళ్ళెత్తి అతని వైపు చూసింది

"ఎందుకా మౌనం ? నువ్వెవరినైనా ప్రేమించావా ?" కృంగిపోతున్న నవనాడుల్నీ కూడగట్టుకుంటూ అతి దీనంగా అడిగేడు రావు. ఎంచేతో అతనికి ఆమె మీద కోపం రావటంలేదు. తన దురదృష్టం మీద తనకే విసుగూ, అసహ్యం పుడుతున్నాయ్.

"చెప్పు కాత్యాయనీ ? నీ కిష్టంలేని పెళ్ళి చేసేరా మీవాళ్ళు ?"

".. ... ..."

"చెప్పు ప్లీజ్ ! నన్నింకా బాధపెట్టకు !"

ఆమె భుజాలు పట్టుకుని వూపుతూ అడిగేడు పట్టరాని ఆవేశంగా రావు.

"నేను... నేను మిమ్మల్నేం చేసేను ?" మెల్లగా అంది

"లేకపోతే ఏవిటి ? నన్నెందుకు దగ్గరకు రానివ్వవు ? నీ మనసులో ఎవరైనా వుంటే చెప్పు కాత్యా... నేనేమనుకోను !"

"ఇదేమన్నా సినిమా అనుకున్నారా ?"

రహస్యం

"అది నాకన్నా నీకే బాగా తెలియాలి..." మెల్లగా ఆమెని ఒదిలేస్తూ అన్నాడు.

ఆమె రిలీఫ్‌గా ఫీలయి గట్టిగా నిట్టూర్పడం గమనించిన అతని మనసు వెయ్యి ముక్కలైంది.

తనంటే ఆ అమ్మాయికి ఎందుకంత ఏవగింపు ? ఈ రకమైన తిరస్కారం జరిగిన పెళ్ళితంతులో ఎక్కడా ప్రదర్శించలేదే ! ఏమో తనే గమనించి వుండడు !

కొంపదీసి ఆ అమ్మాయికి స్త్రీ సహజమైన కోరికలేమీ లేవా ?

అదేమీ అయివుండదు. ఎవడ్నో ప్రేమించి వుంటుంది. ఆ విషయం తలిదండ్రులతో చెప్పేందుకు భయపడి ఈ పెళ్ళికి ఒప్పుకుని వుంటుంది.

తను అదృష్టవంతుణ్ణని పొంగిపోయేడు చదువు అయిపోగానే మంచి జాబ్ రావటం, అనుకోకుండా అందమైన కాత్యా తన భార్య అవటం నిజంగా ఏ జన్మలో చేసుకున్న అదృష్టమో అనుకున్నాడు కానీ... కానీ ఇలా జరిగిందేమిటి ?

కిటికీ దగ్గరకి నడిచి దూరంగా ఎటో చూస్తూ నించుండిపోయేడు.

వెనక్కి తిరిగి ఆ అమ్మాయిని చూడాలంటేనే అసహ్యమేస్తోంది.

నీకోసం

జీవన గమనంపై ఆశలు
వలపుల కవితలు
చతుర రాగాలు
ప్రణయ స్వప్నాలు
మధుర భావాలు
హృదయ పంజరంలో
బందీలుగా చేశాను.
అధరంలో మధువులు
హృదయంలో వలపులు
పదిలంగా దాచి నీకై వేచాను.

— అరుణ

ఎంత మోసగత్తె ? అమాయకురాల్లా కన్పిస్తూ తన జీవితాన్ని నిలువునా దహించి వేసింది... ఈ మహాతల్లిపాలిట తానే పెద్ద విక్టిమ్ అవటం... భగవాన్ ఏం పాపం చేసాడు తాను ? ఆలోచిస్తూ ఎంతసేపు కూచున్నాడో అతనికే తెలీదు...



MCA-PDP-62-Tel

తను ఆ అమ్మాయి భర్త ... ఆ అమ్మాయికి ఇష్టమున్నా లేకపోయినా బలవంతంగా అనుభవించేందుకు తనకి హక్కు వుంది. చవట వెధవలా యిలా ఏడుస్తూ కూచోవలసిన ఖర్మ తనకేమీ లేదు ... ఛ ఎంత మీన్‌గా ఆలోచిస్తున్నాడు తాను...తన భార్యని తను రేప్ చెయ్యటమా ?! 'ఐ కాంట్ రేప్ మై వైఫ్...' బట్ ... ఈ విషయం ఇప్పుడే తేల్చుకోవాలి. ఆ అమ్మాయికి నిజంగా తనంటే ఇష్టంలేకపోతే...ఇష్టంలేకపోతే ఆ ప్రేమించినవాడెవడో వాడి దగ్గరకే పంపేస్తాడు తాను ... మనసులేని భార్య తన కొద్దు ... తనని తానుగా ప్రేమించే భార్యనే తాను కోరుకుంది !

తల తిప్పి చూసేడు. కాలి బొటనవ్రేలితో నేలను రాస్తూ అలాగే నించునివుంది కాత్యా...

"మహానటి !" అని పళ్ళు పటపట కొరుక్కున్నాడు.

అంతలోనే జాలి వేసిందామె మీద. ఛ ! చిన్నపిల్ల భయపడిందేమో ... ఆమె భయం పోగొట్టవలసిన బాధ్యత తన మీద వుంది...

"కాత్యా...ఇలారా..." మెల్లిగా అన్నాడు.

బిక్కు బిక్కుమంటూ చూసిందతనివైపు.

"చిన్న ... ఏమిటా మొండితనం ? ఇలా రా..." కరుగ్గా ధ్వనించిందతని గొంతు ... అంత కఠినంగా పిలిచి వుండకూడదనుకున్నాడు మనసులో రావు...

మెల్లిగా అడుగులేసుకుంటూ అతని దగ్గరకు నడిచి వచ్చింది కాత్యా ... తన కతి సమీపంలోకి వచ్చిన ఆమెనించి కొంచెం వెనక్కి జరిగేడు రావు.

దెబ్బతిన్నట్టు చూసిందతనివైపు.

అదేమీ పట్టించుకోలేదు రావు.

"చూడు కాత్యా ! పెళ్ళి అంటే తమాషా కాదు. నీ దురదృష్టమో ... నా దౌర్భాగ్యమో మనిద్దరికీ పెళ్ళయింది ... (ఆ సమయంలో కాత్యా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి). ఇప్పటికైనా మించిపోయిందేమీలేదు. నీ మనసులో ఎవరున్నారో చెప్పు. అతన్నీ, నిన్నూ భగవంతుడిసాక్షిగా ఒకటిచేస్తాను ... కానీ ... కానీ నువ్వు ఇంత పిరికిగా ప్రవర్తించి మనిద్దరి జీవితాలూ నాశనం చేసేకంటే ముందే ధైర్యంగా మీవాళ్ళతో నీ సంగతి చెప్పి వుండవలసింది... ఎవరతను ?" పళ్ళ బిగువున అన్నాడు తన ఫీలింగ్స్ ఏవీ బయట పడకుండా...

"నాకెవరూ లేరండీ!" ఆమె గొంతు వణికింది.

"అబద్ధాలు ఆడేవాళ్ళంటే నాకు చాలా అసహ్యం. ఎందుకా అబద్ధాలు ?"

"ఒట్టు! అలాంటిదేమీ లేదండీ !" అంది దీనంగా.

ఆశ్చర్యంగా చూసాడామెవైపు, "మరి ? నేనంటే ఇష్టంలేదా ? అదైనా ముందే చెప్పొచ్చుగా ?"

"మీరంటే నాకు చాలా ఇష్టం... ఇష్టపడే చేసుకున్నాని పెళ్ళి !"

"లాభంలేదు... నీతో నేను నిజం చెప్పించలేను" నిస్పృహతో అన్నాడు రావు. కొద్ది క్షణాలు మౌనం.

చివరికి ఆమె ఓ నిశ్చయానికి వచ్చినట్లు, "ఏమండీ..." అందతనివైపు తిరిగి;

ఏమిటన్నట్లు చూశాడు.

"ఎలా చెప్పాలో తెలీటంలేదు..." అంది బెరుగ్గా.

'నా ఖర్మ' అని మనసులో తిట్టుకున్నాడు---

"మరి మీరు ఏమీ అనుకోకూడదు..."

'ఏడిసినట్లేవుంది... ఏమీ చెప్పకుండా ఏమనుకోనిచావను ?' అనుకున్నాడు.

"మరి...మరి... నాకు... చిన్నుల్లిపాయంటే అసహ్యమండీ !"

ఆ సంగతి ఇప్పుడెందుకో ఎంత తన్నుకున్నా రావుకి అర్థంకాలేదు.

"మీకు ఇష్టం కదూ !" అందతనివైపు కొంచెం ధైర్యంగా చూస్తూ.

నిజంగా పాదిమనిషి అని మనసులోనే నిసుక్కున్నాడు.

"అయితే నన్ను దగ్గరకి రానివ్వకపోవటానికీ దీనికి సంబంధం ఏమిటి ? నా జేబులో వుల్లుల్లిపాయలు లేవే..." అన్నాడు వెటకారంగా.

'కానీ... కానీ మీ నోట్లోంచి చిన్నుల్లిపాయ వాసన ఘాటుగా వస్తోందండీ" అమాయకంగా అంది కాత్యా !

మొదట తెల్లబోయిన రావుకి పొట్ట చెక్కలయ్యేలా నవ్వొచ్చింది...

అతనికి దూరంగా నిలబడలేని కాత్యా అతని గుండెల్లో తల దాచుకొంది. ★

పశ్చిమజర్మనీలో జరిగిన పరుగుపందెం పోటీలలో 22 సంవత్సరాల కార్ల్ ఫ్లైషన్ 10,000 మీటర్ల దూరాన్ని 27 నిముషాల 36.8 సెకండ్ల సరిక్రొత్త రికార్డును స్థాపించాడు. శ్రీ ఫ్లైషన్ యిటీవలే ఇంజనీరింగులో ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణుడైనాడు. ఆగస్టులో యూరోపియన్ కప్ పోటీలలో పాల్గొనాలనుకుంటున్నాడు.